క్లుప్తంగా

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సరికాదు



ఉరవకొండ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఉరవకొండ: ప్రభుత్వం మొండిగా 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తే ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో దశల వారీ ఉద్యమాలు చేస్తామని జిల్లా నాయకుడు తరుణ్, మండల కార్యదర్శి మధు తెలిపారు. సోమవారం ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విద్యార్థి సంఘం నాయకులు తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తే అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య వ్యతిరేకిస్తుందన్నారు.

కణేకల్లులో భారీ వర్షం

కణేకల్లు: కణేకల్లు మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. కణేకల్లు, మాల్యం, కళేకుర్తి, యర్రగుంట, గరుడచేడు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వంకలు, వాగులు పొంగి పారాయి. వర్షపాతం 40 ఎంఎంగా నమోదైంది. కణేకల్లులోని ఇందిరమ్మ కాలనీలో భారీ వర్షంతో రోడ్లలో నీరు నిలిచిపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

'ఉపాధి' నిధుల అక్రమాలపై విచారణ చేయించండి

కళ్యాణదుర్గం: మండలంలోని నారాయణపురంలో ఉపాధి నిధుల అక్రమాలపై విచారణ జరిపించాలని గ్రామస్తులు, ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు కోరారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉమేష్ పనిచేయక పోయినా దొంగ బిల్లులు సృష్టించి స్వాహా చేస్తున్నారన్నారు. రూ.లక్షలు అవినీతికి పాల్పడినట్లు తెలిపారు. దళిత జన జాగృతి అధ్యక్షుడు ఆర్‌కే రాజు, ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప, నారాయణపురం ఎంపీటీసీ సతీష్ పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

కూడేరు: మండలంలోని కమ్మూరు, గొటుకూరు, ఇప్పేరు, కలగళ్ల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సోమవారం యూరియా పంపిణీ చేశారు. పంపిణీని ఏఓ శుభకర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఈఓలు రాఘవేంద్ర, దిలీప్ కుమార్, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా జలధి బిందె పూజ



గంగా జలాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

ఉరవకొండ: మండలంలోని బూదగవిలో వెలసిన గౌరసంద్ర మారెమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం జలధిపూజ నిర్వహించారు. బూదగవి మారెమ్మ ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. రాములమ్మ ఆలయం వద్ద నుంచి పెన్నానది జలాన్ని భారీ ఊరేగింపుగా పట్టణ వీధుల గుండా తీసుకొచ్చి, ఆలయానికి చేర్చారు. పవిత్ర గంగాజలంతో అమ్మవారికి అభిషేకం, మహా మంగళహారతి, కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రాము, అర్చకులు దేవరాజ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాండురంగస్వామి ఆలయ ఆదాయంపై విచారణ



ఆలయ కమిటీ సభ్యులను విచారిస్తున్న ఈవో బాబు

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో వచ్చే ఆదాయంపై దేవదాయశాఖ అధికారి బాబు సోమవారం విచారణ చేశారు. కళ్యాణ మంటపాలు, గదులు, రథోత్సవం, శ్రీవారి నగలు, హుండీ ఆదాయంపై విచారించారు. ఆలయంలో ఎంతమంది పని చేస్తున్నారు.. ఏడాదికి ఆదాయం ఎంత వస్తుంది? అని కమిటీ సభ్యులతో విచారించారు. గత మూడేళ్లలో వచ్చిన ఆదాయం, ఖర్చుల వివరాలు ఇవ్వాలని కమిటీ సభ్యులకు సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామానికి చెందిన కెంచప్పతో పాటు మరికొందరు రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయంలో వచ్చిన ఆదాయంలో అవకతవకలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేయడంతో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ తిరుమల రెడ్డి ఆదేశాల మేరకు విచారణ చేసినట్లు తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఈవో బాబు అన్నారు.

వామ్మో.. దుర్గంధం



మున్సిపల్ కార్యాలయ సమీపంలో వృథాగా పడి వున్న చెత్త సేకరణ డస్ట్‌బిన్లు

కంబదూరు రింగ్ రోడ్డు నుంచి గరుడాపురం వెళ్లే రహదారి పక్కన పడేసిన ఖాళీ మద్యం బాటిళ్లు, గ్లాస్‌లు

నాగులకట్ట వద్ద నుంచి రాయదుర్గం వెళ్లే ప్రధాన రహదారి మీద పడేసిన కోళ్ల వ్యర్థాలు

- రోడ్లపక్కనే ప్లాస్టిక్, కోళ్ల వ్యర్థాలు
- దుర్వాసన వస్తున్న ఔటర్ రింగ్ రోడ్లు
- డంపింగ్ యార్డుకు చేరని చెత్తాచెదారం

కళ్యాణదుర్గం: అనంతపురం నుంచి రాయదుర్గం వైపు వెళ్లే ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని సుబేదారు చెరువుకు అనుకుని కొందరు చెత్తా చెదారంతో పాటు కోళ్ల వ్యర్థాలు, మాంసం వ్యర్థాలను ప్లాస్టిక్ సంచులలో తెచ్చి రోడ్డు పక్కనే పడేస్తున్నారు. దీంతో కుక్కలు పీక్కుతిని కొంత భాగాలను రోడ్డుపైకి తీసుకువస్తున్నాయి. చెల్లాచెదురుగా పడి దుర్వాసన వస్తున్నాయి. పాడుబడిన భవనాల యజమానులు శిథిలాలను ఇదే దారి పక్కనే పడేస్తుండడంతో రోడ్డంతా ఆక్రమణకు గురవుతోంది. కంబదూరు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి గరుడాపురానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే మద్యం దుకాణం, సమీపంలోని హోటళ్ల నుంచి నిర్వాహకులు వ్యర్థాలను రోడ్డుపైనే పడేస్తున్నారు. కంబదూరు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి అనంతపురానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన టమాట మండీలు ఉండటంతో వ్యర్థాలను రోడ్డుపక్కనే పడేయడంతో అపరిశుభ్రత నెలకొంది.

డంపింగ్ యార్డుకు చేరని చెత్తా, చెదారం:

- కళ్యాణదుర్గం సమీపంలోని ముదిగల్లుకు వెళ్లే రోడ్డు పక్కన ప్రభుత్వం డంపింగ్ యార్డు ఏర్పాటు చేసింది. పట్టణంలోని చెత్తాచెదారమంతా మున్సిపాలిటీ సిబ్బంది ట్రాక్టర్లు, ఆటోలతో డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉన్నా అమలుకాలేదు. ఆయా వార్డులలో మురుగు, డస్ట్‌బిన్ల వద్ద ఉన్న మురుగు, చెత్త మాత్రమే డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. మిగిలిన చికెన్, మటన్, ఇతర మాంసం విక్రయాల వ్యాపారులు సుబేదారు చెరువులో కొంత, రోడ్డు పక్కనే కుప్పలు తెప్పలుగా పడేస్తున్నారు. రోడ్డు పక్కన నర్సరీలకు వాడిన ప్లాస్టిక్ కవర్లను వేసి కాల్చివేయడంతో దట్టమైన పొగలోనే వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ రోడ్డు పక్కన చెత్తా, చెదారం, మాంసం వ్యర్థాలను వేయకుండా పర్యవేక్షించాల్సిన మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కొందరు ప్రైవేట్ ఆసుపత్రుల్లోని సిరంజీ, మందులు, వాడేసిన సెలైన్ బాటిళ్లను సైతం రోడ్డుపైన వేస్తున్నారు.

వ్యర్థాలతో అనర్థాలు



ప్లాస్టిక్, మాంసం వ్యర్థాలు కాల్చిన పొగ పీల్చడం వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వస్తాయి. చిన్నారులు, వృద్ధుల్లో శ్వాస సంబంధిత వ్యాధులతో పాటు కేన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

– బొమ్మయ్య, వైఎస్సార్‌సీపీ దాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రజలకు ఇబ్బందులు



ఔటర్ రింగ్ రోడ్డు పక్కన మట్టి దిబ్బలు, చెత్తాచెదారం, ప్లాస్టిక్, కోళ్ల వ్యర్థాలు పడేస్తున్నారు. వ్యర్థాలు కాల్చడం వల్ల వచ్చే పొగతో ఆరోగ్య సమస్యలొస్తున్నాయి. డంపింగ్ యార్డును వినియోగంలోకి తీసుకురావాలి. – నీరుగంటి మమత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు

పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలు



ముప్పలకుంటలో మాట్లాడుతున్న తలారి రంగయ్య

బ్రహ్మసముద్రం : పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి అన్నారు. సోమవారం ఎరడికెర, భైరసముద్రం, ముప్పలకుంట గ్రామాల్లో మండల కన్వీనరు పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. తలారి రంగయ్య మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి ఇంటికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు వర్తించాయన్నారు. కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేయకపోగా, ప్రతి వీధికి ఒక బెల్టు షాపు ఏర్పాటు చేసిందన్నారు. ఒక్కో బాటిల్‌పై రూ.30 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సొంత నిధులతో అభివృద్ధి చేస్తానని చెప్పి, సొంతలాభం కోసం కొండలు, గుట్టలు తవ్వుతున్నాడన్నారు. బీటీపీ పనులను ప్రారంభించి, మట్టిని విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు విమర్శించారు.

గ్రామ కమిటీలు ఏకగ్రీవంగా ఎంపిక : ఎరడికెర గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నజీర్, భైరసముద్రం కమిటీ అధ్యక్షుడిగా గొల్ల గోవిందప్ప, ముప్పలకుంట అధ్యక్షుడిగా రవికుమార్, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులను ఏకగ్రీవకంగా ఎంపిక చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప , ఎంపీపీలు కంభం చంద్రశేఖర్ రెడ్డి, ఆంజనేయులు, కన్వీనర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గోళ్లసూరి, మాజీ ఎంపీపీ మహదేవప్ప, వైస్ ఎంపీపీలు వెంకటేష్‌నాయక్, బాధ పల్లప్ప, ఎంపీటీసీ శివన్న రాష్ట్ర యువజన విభాగం నాయకులు రామాంజి , జిల్లా పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కైరేవు ప్రతాప్, ఎర్రంపల్లి కృష్ణమూర్తి, మంజునాథ, మహేష్ స్వామి, సునిల్, తాలూక అనుబంధ సంఘాల అధ్యక్షులు పాతలింగ, సంజీవయ్య, అభిలాష్‌రెడ్డి, మున్సిపల విభాగం అధ్యక్షు మురళి, మండల ఉపాధ్యక్షులు కొండాపురం రాము, మల్లాపురం మల్లికార్జున, ఎస్సీ , ఎస్టీ సెల్ అధ్యక్షులు జానీ, శంకర్‌నాయక్ , మండల అనుబంధ సంఘాల నాయకులు గోవిందు , శ్రీకాంత్, శరణప్ప , నాయకులు ఎర్రిస్వామి, ఎల్లప్ప, తిరుపాల్‌రెడ్డి, గోవిందప్ప , తదితరులు పాల్గొన్నారు.

బాబూ.. ఆడబిడ్డ నిధి ఇచ్చేదెప్పుడు?'



ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కణేకల్లు: 'బాబూ.. ఆడబిడ్డ నిధి.. ఇచ్చేదెప్పుడు?' అని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ సభ్యులు డి.పద్మావతి, వైస్ ఎంపీపీ లీలావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న తదితరులు చంద్రబాబును ప్రశ్నించారు. సోమవారం మండలంలోని కె.కొత్తపల్లి, కె.మారెంపల్లి గ్రామాల్లో 'బాబూ ష్యూరిటీ... మోసం గ్యారెంటీ' రీకాల్ కూటమి మ్యానిఫెస్టో కార్యక్రమం జరిగింది. వివిధ కాలనీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యటించి, ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ వాటిలో మీకు ఏవేవి వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు పూర్తిగా అమలు కాలేదని మహిళలు వైఎస్సార్‌సీపీ నాయకుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో వివిధ అనుబంధసంఘాల నేతలు డి.శ్రీనివాసులు, ఆదినద్దురు చంద్రశేఖర్‌రెడ్డి, హళ్లి నాగరాజు, వేమన, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, ఎం.శ్రీరామిరెడ్డి, హెచ్.గోపాల్, కె.నాగరాజు, కె.వన్నూరుస్వామి, మారెంపల్లి నాగరాజు, తిమ్మప్ప, చెన్నప్ప, చంద్ర, హనుమంతు, గోపాల్, వెంకటేశులు, దేవేంద్ర, చిక్కణ్ణ, రామాంజినేయులు, హళ్లి నాగరాజు, ఖలందర్, మాజీ సర్పంచు లోకేష్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు చిన్న సర్మాస్ పాల్గొన్నారు.

ఆలయాలకు శరన్నవరాత్రుల శోభ



ఉరవకొండ: జగదీశ్వరి ఆలయంలో కలశ ప్రతిష్ట నిర్వహించిన దృశ్యం



ఉరవకొండలో ఆదిలక్ష్మి రూపంలో ఉద్భవ మహాలక్ష్మి అమ్మవారు



రాయదుర్గం కోటలో రాజరాజేశ్వరిదేవి అలంకరణలో వాసవీమాత



బొమ్మనహాళ్‌లో పసుపు అలంకరణలో అమ్మవారు దర్శనం



బెళుగుప్పలో బాలా త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు



తాళ్లకెరలో పార్వతీ దేవిగా దర్శనమిచ్చిన భద్రకాళి

రాయదుర్గంటౌన్/కళ్యాణదుర్గం రూరల్/ఉరవకొండ/బెళుగుప్ప/బొమ్మనహాళ్/గుమ్మఘట్ట/వజ్రకరూరు/కణేకల్లు: నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి వేడుకలు సోమవారం నుంచి భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు రాయదుర్గంలోని నగరేశ్వర కన్యకా పరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు దర్శనమిచ్చారు. కళ్యాణదుర్గంలోని వాసవీమాత స్కందమాతగా **బొమ్మనహాళ్** మండలం గోవిందవాడలో పసుపు అలంకరణ, ఉద్దేహాళ్‌లోని దుర్గమ్మ దేవిగా పూజలు అందుకున్నారు.

గుమ్మఘట్ట మండలంలోని తాళ్లకెరలోని వీరభద్ర స్వామి ఆలయంలో భద్రకాళి పార్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాయదుర్గం మండలం బొమ్మక్కపల్లిలోని రాజరాజేశ్వరి ఆలయంలో బాలా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు.

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డు వద్ద వెలసిన జగదీశ్వరి, సిండికేట్ బ్యాంకు వద్ద వెలసిన ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయాల్లో దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. జగదీశ్వరి ఆలయంలో ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. బెళుగుప్పలోని మంజునాథస్వామి ఆలయంలో విజయదుర్గ అమ్మవారు బాలా త్రిపుర సుందరి అలంకరణలో దర్శనమిచ్చారు. **ఉరవకొండ** పరిధిలోని పెన్నహోబిలం ఉద్భవ మహాలక్ష్మి అమ్మ వారిని ఆదిలక్ష్మి రూపంలో సోమవారం అలంకరించారు. **కణేకల్లులోని** కనకదుర్గ ఆలయంలో దుర్గాపరమేశ్వరిదేవిగా, దుర్గా దేవీ ఆలయంలో బాల త్రిపురసుందరి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.



రాయదుర్గం వరలక్ష్మీదేవి వీధిలో దుర్గాదేవి విగ్రహ ఊరేగింపు



కొనకొండ్లలో అమ్మవారికి ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పూజలు



కణేకల్లులో అలంకరణలో దుర్గాపరమేశ్వరి

పార్వతీపరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కూడేరు: ప్రసిద్ధిగాంచిన పార్వతీపరమేశ్వర జోడు లింగాల సంగమేశ్వర ఆలయంలో సోమవారం పార్వతీపరమేశ్వరుడు ప్రత్యేక పూజలందుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కొలిమివీధి పాత మీసేవా కేంద్రంలోని 2, 7 సచివాలయంలో 23 నుంచి 26 వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కార్యక్రమం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి సోమవారం తెలిపారు. ఆధార్ సేవలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతాయన్నారు. 2011 నుంచి 2016 వరకు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేక ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్న వారు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

కూడేరు: కూడేరులోని బాలుర వసతి గృహంలో విద్యార్థుల సౌకర్యార్థం స్వచ్ఛ భారత్ మిషన్ గ్రాంట్ కింద మరుగు దొడ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరయ్యాయి. సోమవారం మరుగుదొడ్ల నిర్మాణానికి ఎంపీడీఓ కుళ్లాయిస్వామి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగ దివ్య, ఏపీఓ పోలేరయ్య, హాస్టల్ వార్డెన్ ఆదినారాయణ, కార్డ్ సంస్థ ప్రతినిధి నిర్మలా రెడ్డి , ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాగరాజు మృతి తీరనిలోటు



నాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వ

బెళుగుప్ప: కాలువపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నక్కల నాగరాజు మృతి పార్టీకి తీరనిలోటు అని ఉరవకొండ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు విశ్వేశ్వరరెడ్డి, తలారి రంగయ్య అన్నారు. కాలువపల్లికి చెందిన ఈడిగ నక్కల నాగరాజు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులను రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి సోమవారం పరామర్శించారు. నాగరాజు మృతికి సంబంధించి మృతుడి భార్య పద్మావతి, కుమారుడు వరప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాగరాజు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, సర్పంచ్ పెద్దన్న, మాజీ సర్పంచ్ తిమ్మన్న, నాయకులు మధుసూదన్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎర్రిస్వామి నాయకులు పాల్గొన్నారు.

రస్తా ఇవ్వలేదని దౌర్జన్యం



ప్లాన్‌లో ఉండే దొడగట్ట రస్తాకు అడ్డంగా తవ్వించిన గోతి

డి హీరేహాళ్ (రాయదుర్గం): పట్టా భూముల్లో రస్తా ఇవ్వనందుకు టీడీపీ నాయకుడు రైతుల్ని అడ్డు పెట్టుకుని రచ్చ చేస్తున్నాడని మురడి గ్రామానికి చెందిన బాధిత రైతులు ఈశ్వరరెడ్డి, సరస్వతి, శివారెడ్డి, కాపు ఆనందరెడ్డి వాపోయారు. సోమవారం వారికి జరిగిన అన్యాయంపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి వద్ద గోడు వెళ్లబోసుకున్నారు. బాధిత రైతులు మాట్లాడుతూ ప్లాన్ ప్రకారం వెళ్లే రస్తాలు రెండు ఉన్నా తమ పొలాల్లోనే దారి ఇవ్వాలని కక్ష సాధింపుతో వ్యవహరిస్తున్నారన్నారు. మురడి నుంచి హులికల్లుకు వెళ్లే రస్తాతో పాటు దొడగట్ట రోడ్డును కలిపే పొలాల రస్తాలపై జేసీబీలతో అడ్డంగా గోతులు తవ్వించారన్నారు. రస్తా విషయంపై హైకోర్టులో విచారణ జరుగుతున్నా దౌర్జన్యం చేస్తున్నారన్నారు. తనపైనే కొందరితో అక్రమంగా ఫిర్యాదులు ఇప్పించి కేసులు నమోదుకు ఒత్తిడి తెస్తున్నారని ఈశ్వరరెడ్డి అన్నాడు.

రైతులకు న్యాయం చేయాలి ..

సామరస్యంగా పరిష్కరించుకోవాల్సిన రస్తా విషయంపై రాద్ధాంతం చేస్తూ అక్రమంగా కేసుల్లో ఇరికించడం సరికాదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి అన్నారు. రైతులపై టీడీపీ నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరికాదన్నారు. అందరి మధ్య సమన్వయం చేయాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు. బాధిత రైతులకు అన్యాయం చేయాలని చూస్తే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీని కలిసి విన్నవిస్తామని అన్నారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: శివారు ప్రాంతం లెప్రసీ కాలనీ వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన ప్రవీణ్, గుణశేఖర్ గాయపడ్డారు. ఆ ఇద్దరు ద్విచక్ర వాహనంపై ఉరవకొండకు వెళ్లి తిరుగు ప్రయాణంలో బైక్ అదుపుతప్పి లారీని వెనుకవైపున ఢీకొట్టారు.

యువకుడు ఆత్మహత్య

కళ్యాణదుర్గం రూరల్: ఎర్రంపల్లికి చెందిన రమేష్ (38) కడుపు నొప్పి తాళలేక సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. రమేష్ వ్యవసాయ కూలిగా చేస్తూ భార్య జయలక్ష్మి, ఇద్దరు పిల్లలను పోషించుకునేవాడు. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గరుడాపురం సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

కళ్యాణదుర్గం (కంబదూరు): కంబదూరు మండలంలోని కుర్లపల్లిలో నాటుసారా విక్రయిస్తున్న నాగేంద్ర, గూళ్యం గ్రామానికి చెందిన లక్ష్మిదేవిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ సోమవారం తెలిపారు. కుర్లపల్లిలో నాగేంద్ర నుంచి 10 లీటర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారన్నారు. గూళ్యం గ్రామానికి చెందిన లక్ష్మిదేవిని ఏడాది నుంచి సారా కేసులో పరారీలో ఉండగా ఆమెను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేజీబీవీ కార్యదర్శిగా షబానాబేగం

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ కేజీబీవీలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న షబానాబేగంను ఉమ్మడి జిల్లాల సమగ్ర శిక్ష (కేజీబీవీ) కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ

ఉరవకొండ రూరల్: గంబూషియా చేపలతో దోమల నివారణ సాధ్యమని ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామి రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నింబగల్లు, రేణుమాకులపల్లి గ్రామాల్లో ఉన్న నీటి కుంటల్లో గంబూషియా చేపలు వదిలారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం సోకిన వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీకెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

గిరిజన తండాలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప తండాలో సమాజంలో ఆరోగ్యవంతమైన మహిళలు.. శక్తివంతమైన కుటుంబం కార్యక్రమాన్ని వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, స్థానిక నాయకులు మల్లికార్జునతో కలసి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ్ మాసంలో భాగంగా బాలింతలు, గర్భిణులకు పోషక విలువలు అంశంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సీహెచ్‌ఓ పద్మావతి వివరించారు.

మూడేళ్లలోపు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కూడేరు: మూడేళ్లలోపు పిల్లలపై తల్లులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ సూచించారు. సోమవారం పోషణ మహోత్సవాల్లో భాగంగా జల్లిపల్లిలో 0-3 ఏళ్లలోపు పిల్లలు శారీరకంగా , మానసికంగా అభివృద్ధి చెందడానికి అనుసరించాల్సిన విధానాలపై తల్లులకు అవగాహన కల్పించారు. సూపర్ వైజర్ సురేఖ మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం పై జాగ్రత వహించాలని, తగినంత పోషకాహారం అందించాలన్నారు.

పంటకోత ప్రయోగాలు పకడ్బందీగా నిర్వహించాలి

వజ్రకరూరు: పంటకోత ప్రయోగాలు పకడ్బందీగా నిర్వహించాలని ఏఓ మధుకర్, సహాయగణాంక అధికారి పర్వతప్ప తెలిపారు.స్థానిక రైతుసేవా కేంద్రంలో పంటకోత ప్రయోగాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల్లో ఎక్కడైనా సందేహాలు వస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకు వచ్చి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, వీఎస్ఏలు,ఎంపీఈఓలు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రారంభం

శెట్టూరు: మండలంలో జరిగిన ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ పనులపై సామాజిక తనిఖీ జరుగుతున్నట్లు ఏపీఓ నీరజ తెలిపారు. సోమవారం సామాజిక తనిఖీ బృందం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుంది. సోమవారం, మంగళవారం రెండు రోజుల పాటు పనులకు సంబంధించిన రికార్డులు సేకరించి, బుధవారం నుంచి క్షేత్ర స్థాయిలో పనులను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. 2014 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు జరిగిన పనులకు ఆడిట్ ఉంటుందన్నారు. సుమారు రూ.13 కోట్లా 40 లక్షలా 64 వేలకు జరిగిన మొత్తం పనులకు తనిఖీ ఉంటుందన్నారు. తనిఖీ ఎస్ఆర్‌పీ నీలకంఠ, 16 మంది డీపీఆర్‌ఓలు ఆధ్వర్యంలో తనిఖీ ఉంటుందన్నారు.